ఐటీలో హైదరాబాద్‌షా

బెంగళూరును మించిపోయిన భాగ్యనగరం!

- సిలికాన్ వ్యాలీ కిరీటం ఇక హైదరాబాద్‌కే!
- గత పదేండ్లలో ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా వెనుకబడిన బెంగళూరు
- ప్రముఖ ఐటీ నిపుణుడు మోహన్‌దాస్
- తెలంగాణలో గత పదేండ్లలో ఐటీ రంగంలో గణనీయమైన వృద్ధి
- ఐటీ ఎగుమతులు, ఉద్యోగాల కల్పనలో దేశంలోనే అగ్రభాగాన హైదరాబాద్

బెంగళూరు/హైదరాబాద్, నవంబర్ 29: ఒకప్పుడు ఐటీ అంటే బెంగళూరు. భారత సిలికాన్ వ్యాలీగా ఆ నగరం పేరుపొందింది. కానీ ఇప్పుడు ఐటీ అడ్డాగా హైదరాబాద్ నిలుస్తున్నది. గత తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఐటీ రంగంలో హైదరాబాద్ రాకెట్ వేగంతో దూసుకుపోతున్నది. జాతీయ, అంతర్జాతీయ ఐటీ రంగ నిపుణులు ఇదే విషయాన్ని స్పష్టంచేస్తున్నారు. ఐటీ దిగ్గజం టీవీ మోహన్‌దాస్ పాయ్ బుధవారం హైదరాబాద్, బెంగళూరు నగరాల్లోని ఐటీ పరిశ్రమ పరిస్థితులపై చేసిన ట్వీట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఐటీ రంగం అభివృద్ధిలో హైదరాబాగ్ నగరం బెంగళూరును మించిపోనున్నదని ఆయన అభిప్రాయపడ్డారు. కర్ణాటకలో గత 10 ఏండ్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహించాయని, ఇదే ప్రస్తుత పరిస్థితికి కారణమైందని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన తన ట్వీట్‌కు సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లను ట్యాగ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బెంగళూరులో టెక్ సదస్సు(బీటీఎస్) నిర్వహిస్తున్న రోజునే మోహన్‌దాస్ పాయ్ ఈ ట్వీట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

దశ దిశ లేని పాలనీలతో బెంగళూరు అస్తవ్యస్తం

కర్ణాటకలో గత బీజేపీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల దశ దిశ లేని పాలనీలు, ప్రభుత్వంలో అంతులేని అవినీతి కారణంగా పెట్టుబడిదారులు వెనక్కు తగ్గుతున్నట్టు విశ్లేషణలు వస్తున్నాయి. బెంగళూరు నగరంలో ట్రాఫిక్ కష్టాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. నగరంలో 2-3 కిలోమీటర్ల ప్రయాణానికి గంటల సమయం పడుతుందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు నిరంతర విద్యుత్తు కోతలు, తాగునీటికి తంటాలు, మౌలిక వసతుల లేమి, లోపభూయిష్టమైన పాలనీలు, ప్రభుత్వంలో పేరుకుపోయిన అవినీతి వెరసి బెంగళూరులో కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు వెనుకడుగు వేస్తున్నారు.

టెకీల నియామకంలో దేశంలోనే మనమే నంబర్1

ప్రపంచ ఐటీ నగరంగా హైదరాబాద్ ఖ్యాతి గడిస్తున్నది. ఐటీ రంగంలో ఉద్యోగ నియామకాల్లో అగ్రభాగాన ఉన్నది. సియాటెల్-వాషింగ్టన్ ప్రధాన కార్యాలయాలుగా పనిచేసే ప్రముఖ టెక్నికల్ ఇంటర్వ్యూ సంస్థ కారత్ ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. టెకీల నియామకంలో హైదరాబాద్ దేశంలోని అన్ని నగరాల కంటే ముందున్నది. అదే విధంగా ప్రపంచంలోని టాప్-20 నగరాల్లో ఏకంగా పదో స్థానం దక్కించుకోవడం గర్వకారణం. అంతేకాదు.. ప్రతిభ ఉన్న టెకీల కోసం అంతర్జాతీయ కంపెనీలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయని నివేదికలో వెల్లడైంది. హైదరాబాద్ నగరం ప్రపంచంలోని వాషింగ్టన్, ఆస్టిన్, లాస్ ఏంజిల్స్ వంటి పలు ఐటీ హబ్ నగరాలను కూడా వెనక్కు నెట్టి రికార్డులు సృష్టించింది.

2 లక్షల కోట్లు దాటిన ఐటీ ఎగుమతులు

ఐటీ ఎగుమతుల్లో గత ఏడాది దేశ వ్యాప్తంగా 17.20 శాతం వృద్ధి రేటు ఉంటే, తెలంగాణలో 26.14 శాతం నమోదైంది. 2022-23లో హైదరాబాద్ నుంచి ఐటీ ఎగుమతులు దాదాపు రూ.2.4 లక్షల కోట్లు దాటాయి. కొత్త ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగానే ఏర్పాటు కావడంతో ఐటీ ఎగుమతుల వృద్ధి రేటు గణనీయంగా పెరుగుతున్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అఫీస్ స్పేస్ వినియోగంలోనూ బెంగళూరును హైదరాబాద్ ఎప్పుడో దాటేసింది. గణనీయమైన వృద్ధితో దూసుకుపోతున్నదని అన్‌రాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్ ఇండియా ఇటీవల తన నివేదికలో స్పష్టం చేసింది.

మహానగరానికి అంతర్జాతీయ కంపెనీల క్యూ

తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణనీయ సంఖ్యలో అంతర్జాతీయ టెక్ కంపెనీలు హైదరాబాద్ నగరానికి క్యూ కడుతున్నాయి. ప్రపంచ దిగ్గజ సంస్థ గూగుల్ అమెరికా వెలుపల తన అతిపెద్ద క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తున్నది. 2026 కల్లా దీని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నది. మరోవైపు నగరంలో భారీ డాటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు మరో దిగ్గజ ఐటీ కంపెనీ మైక్రోసాఫ్ట్ ముందుకొచ్చింది. దీన్ని రూ.15 వేల కోట్లతో ఏర్పాటు చేయనున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొన్నది. 2025 నాటికల్లా దీని కార్యాకలాపాలు అందుబాటులోకి రానున్నట్టు సమాచారం. ఈ డాటా సెంటర్ ద్వారా ఐటీ యువ నిపుణులకు మరిన్ని ఉద్యోగవకాశాలు దక్కనున్నాయి.


మోహన్‌దాస్ పాయ్

తెలంగాణలో ఐటీ రంగంలో ఉద్యోగావకాశాలు

సంవత్సరం	ఉద్యోగాలు
2013-14	3,23,396
2014-15	3,71,774
2015-16	4,07,385
2016-17	4,31,891
2017-18	4,75,308
2018-19	5,43,033
2019-20	5,82,126
2020-21	6,28,615
2021-22	7,78,121
2022-23	9,05,715

9 ఏండ్లలో తెలంగాణలో ఐటీ రికార్డులు

2014లో ఐటీ ఎగుమతులు రూ.57,258 కోట్లు	2014లో ఐటీ ఉద్యోగాలు 3,23,396
2023లో ఐటీ ఎగుమతులు రూ.2,41,275 కోట్లు	2023లో ఐటీ ఉద్యోగాలు 9,05,715
తొమ్మిదేండ్లలో పెరుగుదల 321.38 శాతం	తొమ్మిదేండ్లలో పెరుగుదల 180.06 శాతం

2014 కు ముందు	9 ఏండ్లలో తెలంగాణ ప్రగతి
దేశవ్యాప్తంగా కల్పించిన ఐటీ ఉద్యోగాలు 32,90,000	దేశవ్యాప్తంగా కల్పించిన ఐటీ ఉద్యోగాలు 21,10,000
ఉమ్మడి ఏపీలో కల్పించిన ఐటీ ఉద్యోగాలు 3,23,396	తెలంగాణలో కల్పించిన కొత్త ఉద్యోగాలు 5,82,319
దేశవ్యాప్త ఐటీ ఉద్యోగాల్లో ఉమ్మడి ఏపీ వాటా 9.83 శాతం	దేశవ్యాప్త ఐటీ ఉద్యోగాల్లో తెలంగాణ వాటా 27.6 శాతం

కర్ణాటకలో పెట్టుబడులు కష్టం

కర్ణాటకలో ట్రాఫిక్, మౌలిక సదుపాయాల సమస్య ఉన్నది. పరిస్థితులు మారకపోతే, నగరానికి పెట్టుబడులు రావడం కష్టం

– కిరణ్ మజుందార్ షా, బయోకాన్ వ్యవస్థాపకురాలు

తిప్పలు తప్పడం లేదు

కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తున్నా బెంగళూరులోని స్టార్టప్ కంపెనీలకు తిప్పలు తప్పడం లేదు. ఇండియన్ సిలికాన్ వ్యాలీగా పేరుపొందిన బెంగళూరులో ఇప్పుడు ఎటు చూసినా విద్యుత్తు కోతలు, గతుకుల రోడ్లు, నడిచేందుకు ఏ మాత్రం వీలుకాని ఫుట్‌పాత్‌లు, అస్తవ్యస్థమైన నీటి సరఫరా వ్యవస్థలే.

–రవీశ్ నరేశ్, ఖాతా బుక్ సంస్థ వ్యవస్థాపకుడు

టెక్నాలజీ హబ్.. హైదరాబాద్

హైదరాబాద్ దేశ టెక్నాలజీ హబ్‌గా మారింది. దేశంలో అత్యధిక టెక్ ఉద్యోగాలు కల్పించిన నగరాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉన్నది. ఉద్యోగాల కల్పనలో మన హైదరాబాద్ బెంగళూరును అధిగమించింది. గత ఏడాది దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన టెక్ ఉద్యోగాల్లో 33 శాతం హైదరాబాద్ నుంచే కాగా.. ఈ ఏడాది అది 44 శాతానికి చేరింది. 2014లో హైదరాబాద్ టెక్ రంగంలో పనిచేస్తున్న వారి సంఖ్య 3.2 లక్షలు ఉండగా.. ప్రస్తుతం పది లక్షలకు చేరింది. మెరుగైన మౌలిక వసతులు, పారిశ్రామిక అనుకూల విధానాలు, నిపుణులైన యువత ఉండటంతోనే ఇది సాధ్యమైంది.

–వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ గ్లోబల్ బిజినెస్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

హైదరాబాదా.. న్యూయార్కా!

22 ఏండ్ల తర్వాత హైదరాబాద్‌కు షూటింగ్‌కు వచ్చినప్పుడు చూస్తే నేను ఉన్నది ఇండియాలో ఉన్నానా? న్యూయార్క్‌లోనా? అర్థం కాలేదు. నేను గతంలో చూసిన హైదరాబాద్‌కు ఇప్పటి నగరానికి పొంతనలేదు. హైదరాబాద్ ఇండియాలోనూ ఆర్థికంగా బాగా ఎదిగింది

–సూపర్‌స్టార్ రజినీకాంత్

భవిష్యత్తు ఇక్కడే కనిపిస్తున్నది!

భవిష్యత్తు అంతా హైదరాబాద్‌లోనే కనిపిస్తున్నది. టీ హబ్ లాంటి ప్రదేశంలో ఇది కనిపిస్తున్నది. టీ హబ్ నన్ను ఎంతగానో ఆకట్టుకున్నది. ఇక్కడ కూడా కాలిఫోర్నియాలో ఉన్న అనుభూతినే పొందుతున్నా. టీ హబ్ అతి త్వరలోనే భారత ప్రీమియర్ స్టార్టప్ ఇంక్యుబేటర్‌గా మారుతుండడంలో ఆశ్చర్యం లేదు.

–యూఎస్ రాయబారి ఎరిక్ గార్సెటి

కాంట్రాక్టర్లను ఆత్మహత్యల వైపు నెట్టొద్దు

బిల్లుల చెల్లింపులో అంత జాప్యం ఎందుకు?

కర్ణాటక కాంగ్రెస్ సర్కారుపై హైకోర్టు ఆగ్రహం

బెంగళూరు, నవంబర్ 29: చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లను ముప్పుతిప్పలు పెడుతున్న కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులపై అక్టోబర్ 30న ఇచ్చిన తీర్పును అమలు చేయని ప్రభుత్వ సంస్థపై దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం.. బిల్లులు చెల్లించకపోవడంతో ఇప్పటికే ఇద్దరు కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారని, ఇక ముందు ఇది ఎంత మాత్రం కొనసాగరాదని చీఫ్ జస్టిస్ ప్రసన్న బి వరాలే, జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోర్టు ఆదేశించినా పట్టించుకోవడం లేదంటూ బృహత్ బెంగళూరు మహానగర పాలికపై మెస్సర్స్ నిక్లేప్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వేసిన కోర్టు ధిక్కారణ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం బిల్లుల చెల్లింపులో అసాధారణ జాప్యాన్ని తప్పుబట్టింది. ఈ కేసుకు సంబంధించి గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలు, సూచనలు పాటించాలని, ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని ఆదేశిస్తూ డిసెంబర్ 13కు కేసును వాయిదా వేసింది.

ఐఎస్ఎస్‌కు భారత వ్యోమగామి!

న్యూఢిల్లీ, నవంబర్ 29: దాదాపు 40 ఏండ్ల తర్వాత భారత వ్యోమగామి అంతరిక్షంలో అడుగుపెట్టబోతున్నాడు. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' త్వరలో చేపట్టనున్న మిషన్ ద్వారా భారత వ్యోమగామిని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పంపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోవియట్ యూనియన్ 1984లో సూయజ్ టీ-11 రాకెట్ ద్వారా భారత వ్యోమగామి రాకేశ్ శర్మను అంతరిక్షంలోకి పంపిన తర్వాత, మన దేశం నుంచి మరొకరు అంతరిక్షంలో అడుగుపెట్టలేదు. మళ్లీ ఇన్నేండ్లకు భారత వ్యోమగామిని ఐఎస్ఎస్‌కు తీసుకెళ్లేందుకు 'నాసా'తో ఒప్పందం కుదిరినట్టు ఇస్రో చీఫ్ ఎస్ సోమనాథ్ బుధవారం మీడియాకు వెల్లడించారు.

అమెరికాలోనే హెచ్1బీ రెన్యువల్!

వాషింగ్టన్, నవంబర్ 29: వీసా గడువు ముగిసిన విదేశీయులు రెన్యువల్ కోసం మళ్లీ స్వదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అమెరికాలోనే రెన్యువల్ చేసే పైలట్ ప్రాజెక్టును చేపడుతున్నట్టు ఆ దేశ వీసా సర్వీస్ డిప్యూటీ అసిస్టెంట్ సెక్రెటరీ జులీ స్టఫ్ తెలిపారు. హెచ్1బీ వీసాదారులకు ఈ సౌకర్యం కల్పించనున్నట్టు వెల్లడించారు. మొదటి దఫాలో 20 వేల వీసాలను రెన్యువల్ చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంతో అత్యధికంగా భారతీయులే లాభపడనున్నారు. అమెరికా వర్క్ వీసా గడువు ముగిసిన తర్వాత రెన్యువల్ చేయించుకోవాలంటే ఇప్పటివరకు స్వదేశానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రయాణ సమయం, ఖర్చులను దృష్టిలోపెట్టుకొని వీసాదారుల కష్టాలను తొలగించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు జులీ పేర్కొన్నారు.

యూఎన్ఎల్ఎఫ్‌తో కేంద్రం శాంతి ఒప్పందం

న్యూఢిల్లీ : జాతుల మధ్య వైరంతో అట్టుడుకుతున్న మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడానికి మరో అడుగు పడింది. తీవ్రవాద సంస్థ అయిన యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యూఎన్ఎల్ఎఫ్)తో ప్రభుత్వం శాంతి ఒప్పందాన్ని చేసుకుంది. ఇక నుంచి హింసను వీడనున్నట్టు యూఎన్ఎల్ఎఫ్ ప్రకటించిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బుధవారం ప్రకటించారు. మణిపూర్ లోయ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సాయుధ పురాతన గ్రూప్ అయిన యూఎన్ఎల్ఎఫ్‌తో శాంతి ఒప్పందం చరిత్రలో మైలురాయి అని, ప్రజాస్వామ్య పథంలోకి వారిని ఆహ్వానిస్తున్నానని, శాంతి మార్గంలో వారి పయనం విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తున్నట్టు అమిత్ షా తెలిపారు.

ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని దినాలు!

- డిసెంబర్ రెండోవారం నుంచి అమల్లోకి !
- వేతనాల పెంపుపై కొలిక్కివచ్చిన చర్చలు
- కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 29: వేతన సవరణ, వారంలో ఐదు రోజుల పనిదినాల్ని అమలుజేయాలన్న బ్యాంకు ఉద్యోగుల డిమాండ్ త్వరలో నెరవేరబోతున్నది. ఎంతోకాలంగా నలుగుతున్న ఈ అంశాలపై సానుకూల ప్రకటన రాబోతున్నదని కేంద్ర ఆర్థిక శాఖ అధికారిక వర్గాలు బుధవారం తెలిపాయి. బ్యాంకు ఉద్యోగుల వేతనాల్లో పెంపుదల 15 -20% వరకు ఉంటుందని, అంతేగాక వారంలో ఐదు రోజుల పనిదినాలు.. డిసెంబర్ రెండోవారం నుంచి అమల్లోకి రాబోతున్నదని సదరు వర్గాలు తెలిపాయి. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు కూడా ఇది వర్తింపజేస్తారని వెల్లడించాయి. బ్యాంక్ యూనియన్లు, అసోసియేషన్లకు, ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబీఏ)కు మధ్య జరుగుతున్న 12వ ద్వైపాక్షిక ఒప్పంద చర్చలు కొలిక్కివచ్చినట్టు సమాచారం. చర్చలు తుది దశలో ఉన్నాయని, బ్యాంక్ ఉద్యోగుల కీలక డిమాండ్లు నెరవేరే అవకాశముందని ఈ అంశంతో సంబంధమున్న అధికారిక వర్గాలు మీడియాకు తెలిపాయి. చర్చలు సఫలీకృతమయ్యాక, ఇరు వర్గాలకు చెందిన ప్రతినిధులు మెమోరాండంపై సంతకం చేయనున్నాయి. దీనిపై తుది ఆమోదం కోసం మెమోరాండంను కేంద్ర ఆర్థికశాఖకు పంపుతారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ప్రస్తుతం అమలుజేస్తున్న వేతన ఒప్పందం గడువు 2022 నవంబర్ 1తో ముగిసింది. దీంతో నూతన వేతన ఒప్పందంపై బ్యాంకు ఉద్యోగ సంఘాలు, ఐబీఏకు మధ్య చర్చలు మొదలయ్యాయి. పనిదినాలపై కేంద్రం లేదా ఐబీఏ త్వరలో ప్రకటన చేయనున్నట్టు సమాచారం.

వారానికి 55 గంటలకు మించి పని.. ఏటా 8 లక్షల మంది మృతి

అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక

న్యూఢిల్లీ, నవంబర్ 29: అదనపు పని గంటలు మనుషుల ప్రాణాలను గాల్లో కలిపేస్తున్నాయి. వారానికి 55 గంటలకు మించి పనిచేయడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఏటా 8 లక్షల మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నట్టు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) సంచలన నివేదికను బయటపెట్టింది. 2016 గణాంకాల ప్రకారం.. అధిక పని కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 29.6 లక్షల మంది మరణిస్తుండగా వీరిలో అత్యధికులు అదనపు పనిగంటల కారణంగా చనిపోతున్నారు. మొత్తం మరణాల్లో 20.6 లక్షల మంది ఉపాధి కారణంగా వచ్చే వ్యాధుల వల్ల ప్రాణాలు కోల్పోతుండగా, మిగతా 3.3 లక్షల మంది పని ప్రమాదాల కారణంగా చనిపోతున్నారు. అతిపెద్ద కిల్లర్ మాత్రం అధిక పనిగంటలేనని నివేదిక స్పష్టం చేసింది. వారానికి 55 గంటలకు మించి పనిచేయడం వల్ల ఏటా 7,44,942 మంది ప్రాణాలు కోల్పోతున్నట్టు చెప్పుకొచ్చింది. ఇక, వాయువుల కారణంగా 4.5 లక్షల మంది, పని ప్రమాదాల కారణంగా 3,63,283 మంది, ఆస్బెస్టాస్ వల్ల 2,09,481 మంది, సిలికా వల్ల 42,258 మంది, ఆస్తమాకు కారణమయ్యే పదార్థాల వల్ల 29,641 మంది, సోలార్ అల్ట్రావయలెట్ రేడియేషన్ కారణంగా 17,936 మంది, డీజిల్ ఇంజిన్ పొగ కారణంగా 14,728 మంది, ఆర్సెనిక్ వల్ల 7,598 మంది, నికెల్ వల్ల 7,301 మంది చనిపోయినట్టు వివరించింది. వృత్తిపరమైన కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా 13 మిలియన్ల మంది దృష్టిలోపంతో బాధపడుతున్నారు.

రెండేండ్లు ఏం చేశారు?

బిల్లులను ఎందుకు తొక్కిపెట్టారు?

- పెండింగ్‌లో పెట్టడానికి గవర్నర్ ఎలాంటి కారణాలు చెప్పలేదు
- చట్టాల రూపకల్పనను నిలిపివేసేలా అధికారాలను వినియోగించొద్దు
- కేరళ గవర్నర్‌కు సుప్రీంకోర్టు హితవు
- జవాబుదారీతనం ఉండాలని వ్యాఖ్య
- రాష్ట్రపతికి బిల్లులు ఎప్పుడు పంపాలో మార్గదర్శకాలు రూపొందిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ/తిరువనంతపురం, నవంబర్ 29: అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు అటు ఆమోదం తెలుపుకుండా, ఇటు పునఃపరిశీలన కోసం అసెంబ్లీకి పంపకుండా ఏండ్లుగా పెండింగ్‌లో పెట్టిన కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌పై సుప్రీంకోర్టు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు సంవత్సరాలుగా బిల్లును ఎందుకు తొక్కిపెట్టారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. బిల్లులను పెండింగ్‌లో పెట్టేందుకు గవర్నర్ ఎలాంటి కారణం చూపలేదని పేర్కొన్న న్యాయస్థానం.. చట్టసభలు చట్టాలు చేసే ప్రక్రియను నిలిపివేసేలా గవర్నర్ తన అధికారాలను వినియోగించకూడదని హితవు పలికింది. బిల్లుల విషయంలో గవర్నర్‌కు జవాబుదారీతనం ఉండాల్సిన అవసరం ఉన్నదని స్పష్టం చేసింది. ఇటీవల పంజాబ్ గవర్నర్‌కు సంబంధించిన కేసులో ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఎనిమిది బిల్లులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టడంపై గవర్నర్ ఆరిఫ్ ఖాన్‌కు వ్యతిరేకంగా కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది.

విచారణకు ఒక్క రోజు ముందుగా..

తమ రిట్ పిటిషన్‌పై నోటీసులు జారీచేసిన తర్వాత, అది కూడా బుధవారం విచారణ జరుగనున్న నేపథ్యంలో ఒక్కరోజు ముందు గవర్నర్ ఒక బిల్లును ఆమోదించి, మరో ఏడు బిల్లులను రాష్ట్రపతి పరిశీలన కోసం గవర్నర్ రిఫర్ చేసిన విషయాన్ని కేరళ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. వీటిల్లో కొన్ని బిల్లులను అసెంబ్లీ 2021లో ఆమోదించిందని, అప్పటి నుంచి గవర్నర్ పెండింగ్‌లో పెట్టారని పేర్కొన్నారు. 'రెండేండ్లుగా వెల్ఫేర్ బిల్లు చట్టంగా మారేందుకు అనుమతించలేదు. దీని వలన రాష్ట్ర పాలన దెబ్బతింటున్నది. దీనిపై న్యాయస్థానం జోక్యం చేసుకోకుంటే.. అది పౌరులపై ప్రభావం చూపుతుంది' అని వాదించారు. వాదనను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం.. 'మిస్టర్ అటార్నీ జనరల్, గవర్నర్ బిల్లులపై రెండేండ్లుగా ఎందుకు నిర్ణయం తీసుకోలేదు?' అని ప్రశ్నించింది. దీనిపై స్పందించని ఏజీ ఆర్ వెంకటరమణి.. తాను రాజకీయ అంశాల్లోకి పోదలచుకోలేదని అన్నారు. బదులుగా 'మేం వెళ్లాం. ఎందుకంటే ఇది జవాబుదారీతనానికి సంబంధించింది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.


కేరళ గవర్నర్ ఆరిఫ్



అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు?

రాష్ట్రపతి ఆమోదం కోసం బిల్లులను ఏ సందర్భంలో రిజర్వ్ చేయాలో మార్గదర్శకాలు రూపొందించే సమయం ఆసన్నమైందని కేకే వేణుగోపాల్ కోర్టుకు తెలిపారు. రాష్ట్రంలో పాలనను నిలిపివేసేలా గవర్నర్లు బిల్లులను తొక్కిపెట్టడాన్ని అనుమతించకూడదని అన్నారు. రాష్ట్రపతికి గవర్నర్ రిఫర్ చేసిన ఏడు బిల్లుల్లో ప్రభుత్వం మూడింటిని ఆర్డినెన్స్‌ల రూపంలో తీసుకొచ్చిందని, వాటిని అప్పుడు అభ్యంతరం తెలుపుకుండా ఆమోదం తెలిపిన గవర్నర్.. ఇప్పుడెందుకు రాష్ట్రపతికి రిఫర్ చేశారని అన్నారు. మార్గదర్శకాల కోసం పిటిషన్‌ను సవరించేందుకు కేరళ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది.

సీఎంతో కూర్చొని చర్చించండి

విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు గవర్నర్‌కు పలు కీలక సూచనలు చేసింది. బిల్లులపై చర్చించేందుకు సీఎం పినరాయి విజయన్, సంబంధిత మంత్రితో సమావేశం కావాలని సూచించింది. పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్టు న్యాయస్థానం పేర్కొన్నది. లేనిపక్షంలో చట్టాన్ని నిర్దేశించేందుకు, రాజ్యాంగం ప్రకారం తమ విధి నిర్వర్తించేందుకు తాము ఇక్కడ ఉన్నామని స్పష్టం చేసింది. రాష్ట్రపతికి గవర్నర్ ఏ సమయంలో బిల్లులను రిఫర్ చేయాలో అనే అంశంపై మార్గదర్శకాలు రూపొందించడాన్ని పరిగణనలోకి తీసుకొంటామని పేర్కొన్నది. కాగా, గవర్నర్ తీరుపై సీఎం విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళా సంఘాలకు డ్రోన్లు

పేదలకు ఉచిత రేషన్ మరో ఐదేండ్లు

ఎన్నికల వేళ కేంద్రం తాయిలాలు

న్యూఢిల్లీ: ఎన్నికల వేళ కేంద్రంలోని మోదీ సర్కారు తాయిలాలు ప్రకటించింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీలకు) డ్రోన్లను అందించాలని నిర్ణయించింది. అలాగే పేదలకు ఉచిత రేషన్ పథకాన్ని మరో ఐదేండ్లు పొడిగించింది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గం బుధవారం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. రానున్న రెండేండ్లలో (2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో) రూ.1,261 కోట్లతో దేశవ్యాప్తంగా 15 వేల ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు డ్రోన్లను పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు.

పీఎంజీకేఏవై మరో ఐదేండ్లు

ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకాన్ని పొడిగించింది. 81.35 కోట్ల మంది పేదలకు ప్రతి నెలా 5 కిలోల చొప్పున ఉచితంగా అందిస్తున్న రేషన్‌ను మరో ఐదేండ్లపాటు ఇవ్వాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించినట్టు మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు.

పీఎం-జన్‌మన్‌కు ఆమోదం

గిరిజన తెగల ప్రజలకు పక్కా ఇండ్లు, పైపుల ద్వారా నీటి సరఫరా, రోడ్డు సౌకర్యం తదితర 11 రకాల వసతుల కల్పన కోసం ప్రధాన మంత్రి జన్‌జటి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్‌మన్) అమలుకు ఆమోదం తెలిపింది.

మరో మూడేండ్లు ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టులు

లైంగిక నేరాలకు సంబంధించిన కేసుల్లో బాధితులకు సత్వర న్యాయాన్ని అందించాలన్న లక్ష్యంతో ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టులను మరో మూడేండ్లు కొనసాగించేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకయ్యే మొత్తం రూ1,952.23 కోట్లలో నిర్భయ నిధి నుంచి కేంద్ర ప్రభుత్వం రూ.1,207.24 కోట్లు సమకూరుస్తుందని, మిగిలిన రూ.744.99 కోట్లను రాష్ట్రాలు భరించాల్సి ఉంటుందన్నారు.